క్లుప్తంగా

గంగాలమ్మ తీర్థం వైభవంగా నిర్వహించాలి



కొత్తూరులో గంగాలమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అనపర్తి మండలం కొత్తూరులోని గంగాలమ్మ తీర్థం ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాదీ అమ్మవారి తీర్థం వైభవంగా నిర్వహించడం అభినందనీయమని ఆలయ కమిటీ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్తి గంగిరెడ్డి, పడాల సత్తిరెడ్డి, చింతా అచ్చిరెడ్డి, చింతా రామకృష్ణారెడ్డి, పడాల శ్రీనివాసారెడ్డి, సత్తి గోవిందరెడ్డి, సత్తి సత్తిరెడ్డి, సబ్బెళ్ల వెంకటరెడ్డి, సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీలాలమ్మకు ప్రత్యేక పూజలు



బీలాలమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: సింగంపల్లి గ్రామ శివారులో కొలువైన బీలాలమ్మకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి సందర్భంగా గ్రామస్తులు అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో బీలాలమ్మను మాజీ ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బన్న, సర్పంచ్ ఆనంద్, వైస్ సర్పంచ్ సోమిశెట్టి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాకరపల్లి ప్రసాద్, వీరబాబు, మేనేడి వీరబాబు, ద్వారంపూడి వాసు ఉన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



సాయిబాబా ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

బిక్కవోలు: బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీ సాయి ఆలయానికి గురువారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా బాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలోని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల వీర వెంకటకృష్ణ, పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

బాబా ఆలయాల్లో భక్తుల సందడి



రాజానగరం సాయిబాబా ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రాజానగరం: నియోజకవర్గంలోని సాయిబాబా ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన వారితో పాటు స్థానికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం హారతి సమయం వరకూ, తిరిగి సాయంత్రం వేళలలో భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. స్థానిక సాయిబాబా ఆలయంలో కొందరు తమ చిన్నారులకు పటిక బెల్లంతో తులాభారం వేసి, మొక్కులు తీర్చుకున్నారు. అన్నసమారాధనకు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

వీధి కుక్కలతో బెంబేలు



సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో కుక్కల గుంపు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి సమయంలో సుమారు 40 కుక్కలు గుంపుగా గ్రామంలోని నాలుగు బొమ్మల సెంటర్ నుంచి బస్టాండ్ వరకూ తిరుగుతున్నాయి. అటుగా వచ్చే ప్రజలు, ప్రయాణికులు, వాహనచోదకులను భయపెడుతున్నాయి. వారి వెంట పడుతూ పరుగులు పెట్టిస్తున్నాయి. అవి కరుస్తాయనే భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాటిలో కొన్నింటికి డెర్మటైటిస్ అనే వ్యాధి ఉండడంతో భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి, వీటిని అదుపు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీడలేమంటూ.. వీడుకోలంటూ..

- పట్టణాలకు ప్రజల తిరుగు ప్రయాణం
- ముగిసిన సంక్రాంతి వేడుకలు
- పల్లెల నుంచి బయలు దేరిన ఉద్యోగులు, విద్యార్థులు



అనపర్తి రైల్వే స్టేషన్‌లో రైలు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బిక్కవోలు: సంక్రాంతి పండగను సొంతూరులో ఘనంగా చేసుకునేందుకు పట్టణాల నుంచి వచ్చిన ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తిరుగు ప్రయాణమయ్యారు. మూడు రోజుల పాటు కుటుంబ సభ్యులతో సందడిగా గడిపిన వీరందరూ ఆ జ్ఞాపకాలను మదిలో నిలుపుకొన్నారు. కన్నవారికి, సొంతూరికి, స్నేహితులకు వీడ్కోలు చెప్పి తమ జర్నీ ప్రారంభించారు. పండగ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు తమ సొంతూళ్లకు వచ్చారు. నాలుగు రోజులుగా తమ గ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో సరదాగా గడిపారు. ఆటలు, ముగ్గులు తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ సన్నివేశాలను తమ స్మార్ట్ ఫోన్లలో బంధించారు.

ఆత్మీయత

పల్లెల్లో అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యల వద్ద వారం రోజులు సంతోషంగా గడిపిన మనవలు తిరిగి వెళుతుంటే ఆ వృద్ధుల మనసు విలవిల్లాడింది. కొందరు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఏటా పండగకు వచ్చి, నాలుగు రోజులు ఉండి వెళుతున్న తమ పిల్లలను తల్లిదండ్రులు దీవించి, జాగ్రత్తగా సాగనంపారు. మొత్తం మీద సంక్రాంతి అనుబంధాలకు ఆత్మీయతలకు వేదికైంది. పట్టణాలకు వెళుతున్న వారితో బస్టాండ్, రైల్వేస్టేషన్లలో రద్దీ నెలకొంది.

పక్కా ప్రణాళిక

సంక్రాంతికి సొంత గ్రామాలకు రావడం కోసం పట్టణ వాసులు దాదాపు మూడు నెలల ముందుగానే ప్రణాళికలు వేసుకుంటారు. సెలవులకు దరఖాస్తు చేసుకుని, వాటికి అనుగుణంగా టిక్కెట్లను బుక్ చేసుకుంటారు. పండగ సమయం ఎప్పుడు దగ్గర పడుతుందా అని ఎదురు చూస్తుంటారు. పండగ కోసం పట్టణాల నుంచి రావడానికి పెద్ద హడావుడి ఉంటుంది. చివరకు సొంతూరిలో పండగ నాలుగు రోజులు నాలుగు నిమిషాల్లా గడిచిపోతాయి. అయినా ఆ మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ వచ్చే సంక్రాంతి కోసం ఎదురు చూస్తుంటారు.

నిజమైన ఆనందం



ఎక్కడ స్థిరపడినా సొంతూరిలో సొంత మనషుల మధ్య గడపడం ప్రత్యేకమైన అనుభూతినిస్తుంది. చిన్నప్పటి నుంచి సంక్రాంతి పండగ అంటే చాలా ఇష్టం. ఆ సమయంలో మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, గాలిపటాలు ఎగురవేయడం.. ఇలా ప్రతీదీ ప్రత్యేకంగా ఉంటాయి. సంక్రాంతికి రావడానికి కొన్ని నెలల ముందుగానే ఏర్పాట్లు చేసుకుంటాం.

– గొర్రిపోటి తరుణ్ అరవింద్ కుమార్, రైల్వే ఉద్యోగి, హైదరాబాద్

తీయని అనుభూతి



పచ్చని పల్లెల్లో కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండగ చేసుకోవటం గొప్పగా ఉంటుంది. దీని గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. కొద్ది రోజుల కిందటే పండగకు ప్రణాళిక వేసుకున్నాం. ముఖ్యంగా పిల్లలను పొలాల వద్దకు తీసుకెళ్లాం. అక్కడ ఆటలు ఆడించాం. ఇవే మాకు మంచి జ్ఞాపకాలు. ఒక్కోసారి బంధువుల వివాహ వేడుకలు జరిగినా రావడానికి అవకాశం ఉండదు. అందుకే సంక్రాంతికి తప్పకుండా వస్తాం.

– కొలుపూరి వీర వెంకట మణికంఠ, ఉద్యోగి, హైదరాబాద్

ఆనందంగా గడిపాను



ఉద్యోగ రీత్యా చెన్నై లో ఉంటున్నా. సంక్రాంతి కోసం పందలపాక వచ్చాను. పండగ నాలుగు రోజులూ కుటుంబ సభ్యులు, బంధువులతో సరదాగా గడిపాను. స్నేహితులతో కలిసి ఆటపాటలలో పాల్గొన్నాను. గ్రామంలో ముగ్గుల పోటీలు చాలా ఆసక్తిగా జరిగాయి. వాటిని ఫోన్‌లో చిత్రీకరించాను. చెన్నైలో నా తోటి ఉద్యోగులకు వాటిని చూపిస్తాను.

– పడాల వేణుగోపాలరెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, చెన్నై

దాడి చేసిన వ్యక్తిపై కేసు

సీతానగరం: దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రఘుదేవపురం సెంటర్‌లో బుధవారం సాయంత్రం 5.45 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడుతున్నారు. అదే గ్రామానికి చెందిన గోవింద రాజులు వారిని వారించాడు. దీంతో ఘర్షణ పడుతున్న వారిలో ఒకడైన చల్లా సూరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశాడు. అక్కడే ఉన్న బైక్ గేర్ కేస్‌తో గోవిందరాజులు తలపై కొట్టాడు. దీంతో గాయాలపాలైన అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

109 మంది అరెస్టు

రాజానగరం: మండలంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన కోడి పందేలపై దాడులు నిర్వహించి, 109 మందిని అరెస్టు చేశామని సీఐ ఎస్పీ వీరయ్య గౌడ్ తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 40 కేసులు నమోదు చేసి, రూ.50,520, 48 కోడి పుంజులు, 48 కోడి కత్తులను స్వాధీనపర్చుకున్నామన్నారు.

కోడిపందేలు ఆడుతున్న 29 మందిపై కేసు

బిక్కవోలు: పేకాట, కోడిపందేలు ఆడుతున్న 29 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ మండలంలోని బిక్కవోలు, బలభద్రపురం, కొమరిపాలెంలో కోడి పందేలు ఆడుతున్న 12 మందిపై ఆరు కేసులు నమోదు చేసి, వారి నుంచి 12 పుంజులు, 3,240 స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలోని పేకాట ఆడుతున్న 17 మందిపై ఆరు కేసులు నమోదు చేసి, రూ.23,670 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

బిక్కవోలు: తమ పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ ఉన్నత స్థానాల్లో ఉండడం చాలా సంతోషంగా ఉందని పందలపాకలోని పడాల పెద పుల్లారెడ్డి ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తి రాజు అన్నారు. ఆ పాఠశాలలో 2004–2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం ఘనంగా జరిగింది. అమెరికా, హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 67 మంది విద్యార్థులు తరలివచ్చారు. సుమారు 20 ఏళ్ల తర్వాత స్నేహితులందరూ కలుసుకున్నారు. మృతి చెందిన ఉపాధ్యాయులు, స్నేహితులు వంటాకు నాగజ్యోతి, ప్రసాద్‌కు నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు, ప్రసుత్తం పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తి రాజు మాస్టార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పండూరి రామ్ గంగాధర్, వేణు, సతీష్, హరికృష్ణ, గండి కుసుమ, తుమ్మరి శివ చంద్ర శేఖర్, లక్ష్మి, నాగలక్ష్మి, సోమయాజుల మణికంఠ, యసలపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గొల్లాలమ్మ సంబరం



గొల్లాలమ్మ సంబరానికి తరలివచ్చిన భక్తులు

పెదపూడి: అనపర్తి మండలం రామవరం గ్రామ దేవత గొల్లాలమ్మ సంబరాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి రెండేళ్లకు అమ్మవారి సంబరం నిర్వహించడం ఆనవాయితీ. కర్రి వంశీయులను గొల్లాలమ్మకు అత్తవారి కుటుంబంగా, మల్లిడి వంశీయులను అమ్మవారి కుటుంబంగా భావిస్తారు. సంక్రాంతి పండగ నెల ప్రారంభంలో గొల్లాలమ్మను అత్తవారి ఇంటి నుంచి గ్రామంలోకి తీసుకొచ్చి నడివీధిలో తాటాకులతో పందిరి ఏర్పాటు చేస్తారు. సంక్రాంతి రోజు జాతర నిర్వహించి, కనుమ రోజు నైవేద్యాలు సమర్పిస్తారు. ముక్కనుమ రోజు అమ్మవారిని తిరిగి అత్తవారి ఇంటికి పంపిస్తారు. ఈ సందర్భంగా గురువారం సంబరం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, గ్రామ ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, విశాఖపట్నం గౌతమి సంస్థల అధినేత సత్తి రామకృష్ణారెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త మల్లిడి అబ్బాయిరెడ్డి, అనపర్తి మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

మధురపూడి: సంక్రాంతి సంబరాలు ముగిశాయి. చివరి రోజు ముక్కనుమ పండగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. పండగ సందర్భంగా కోరుకొండ మండలంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కణుపూరు గ్రామంలోని ధన్వంతరి సహాయ పీఠంలో డాక్టర్ రవివర్మ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా పలు కార్యక్రమాలు చేశారు. ముక్కనుమ రోజు పక్షుల పూజ, కోలాటం, నృత్య ప్రదర్శనలు జరిగాయి. నాలుగు రోజుల పాటు జరిగిన కార్యక్రమాల్లో సినీ రచయిత జీకే భారవి, ప్రముఖ హీరోయిన్ సంగీత పాల్గొన్నారు. అలాగే కోరుకొండలోని మినీ సీతారామ కల్యాణ మండపంలో అమ్మాయిలు వెర్సెస్ ఆడపడుచులు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, స్థానిక నాయకులు బదిరెడ్డి దొర, తులసి ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటలు, పాటల పోటీలు జరిగాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కర్రి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుషుల కబడ్డీ విజేత జి.మామిడాడ



విజేత జట్టుకు బహుమతులు అందిస్తున్న కొవ్వూరి వేణుగోపాలరెడ్డి

బిక్కవోలు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కొంకుదురు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పురుషుల కబడ్డీ పోటీల్లో కాకినాడ జిల్లా పెదపూడి మండలం జి.మామిడాడ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో సామర్లకోట జట్టుపై 23–18 తేడాతో జి.మామిడాడ విజయకేతనం ఎగుర వేసింది. అనంతరం విజేతలకు కొమరిపాలెం డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాస్ రెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పీవీ, ఎస్వీ సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరి వెంకట రామారెడ్డి, కొవ్వూరి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ శంకరుల రథోత్సవం



శ్రీరంగపట్నం రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో గౌరీ శంకరుల రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా జరిగిన రథోత్సవంలో గౌరీ శంకరులు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉదయం అమ్మవారికి పూజలు నిర్వహించారు. వీరభద్రుల సంబరం, అమ్మవారికి సారె ఊరేగింపు జరిగాయి. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి సారెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించడం ఇక్కడి ఆచారం. రథోత్సవంలో యువకుల వేషధారణ, విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

హరిదాసుకు సత్కారం



హరిదాసును సత్కరిస్తున్న వీర సుందరరావు దంపతులు

రంగంపేట: మన సంస్కృతి, సంప్రదాయాలకు హరిదాసులు ప్రతీక అని రంగంపేట మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం హరిదాసును వీర సుందరరావు, దేవీ పార్వతి దంపతులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ధనుర్మాసంలో విష్ణుమూర్తి ప్రతినిధులుగా హరిదాసులు గ్రామాల్లో సంచరిస్తూ, హరినామ సంకీర్తనలు చేస్తారన్నారు. వీరి గురించి పిల్లలకు తెలియజేయడం మన బాధ్యత అన్నారు.

హరిదాసులతో పల్లెలకు సంక్రాంతి శోభ



పందలపాకలో హరిదాసుకు బియ్యం వేస్తున్న చిన్నారులు

- ధనుర్మాసం నెలరోజులూ సంచారం
- గ్రామాల్లో హరినామ సంకీర్తనలు
- మళ్లీ వచ్చే ఏడాదే వారి దర్శనం

బిక్కవోలు: తెలుగు ప్రజలు పెద్ద పండగా పిలుచుకునే సంక్రాంతి సంబరాలు పూర్తయ్యాయి. నాలుగు రోజుల పాటు నెలకొన్న సందడి మూగబోయింది. పండగకు వచ్చిన వారందరూ తమ ఊళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే సంక్రాంతి అనగానే భోగిమంటలు, గొబ్బెళ్లు, గాలిపటాలు, కోడిపందేలు గుర్తుకువస్తాయి. కానీ పండగ సందడి మాత్రం హరిదాసులతో మొదలవుతుంది. ధనుర్మాసం నెల రోజుల పాటు పల్లెలను శ్రీహరినామ సంకీర్తనలతో వీరు నిద్ర లేపుతారు. ఆధ్యాత్మిక వాతావరణం సృష్టిస్తారు. నెల రోజుల పాటు గ్రామాల్లో సంచారం చేసి, పండగ పూర్తయిన తర్వాత విరమిస్తారు.

ఏటా క్రమం తప్పకుండా..

హరిదాసులు ఏటా క్రమం తప్పకుండా తమకు కేటాయించుకున్న గ్రామాలకు వస్తుంటారు. తలపై అక్షయ పాత్ర, మెడలో నిలువెత్తు దండ, పట్టు పీతాంబరాలు ధరించి ఒక చేతిలో చిడతలు మరో చేతిలో తంబుర, నుదుటన నామాలు, కాళ్లకు గజ్జెలు కట్టుకుని, విష్ణునామ స్మరణ చేస్తూ ముందుకు సాగుతారు. తమ వీధుల్లోకి వచ్చే హరిదాసులకు మహిళలు, చిన్నారులు బియ్యం, డబ్బులు సమర్పిస్తారు. కాగా.. పండగ ముగియడంతో హరిదాసులు బుధ, గురు వారాల్లో ఇంటింటికీ వెళ్లి ఆయా గృహస్తులే ఇచ్చే తృణమో పణమో తీసుకుని వారిని ఆశీర్వదిస్తున్నారు. మరో రెండు రోజుల పాటు గ్రామాల్లో అన్ని ఇళ్లను సందర్శించి, తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్తామని వారు చెబుతున్నారు. తమకు భక్తులు సమర్పించిన కానుకలు, బియ్యంలో కొంత భాగం భద్రాచలంలో రాములవారికి సమర్పించి మిగిలిన వాటితో తమ కుటుంబాలను పోషించుకుంటామని చెబుతున్నారు.

అక్షయ పాత్రకు చరిత్ర

హరిదాసులకు అక్షయపాత్ర చాలా ముఖ్యమైనది. తెల్లవారు జామున పాత్రను ధరించిన తరువాత గ్రామ సంచారం చేస్తారు. మహావిష్ణువు సూర్య భగవానుడికి అందించిన అక్షయపాత్రను వనవాస సమయంలో ధర్మరాజుకు కృష్ణుడు ఇచ్చాడని పురాణాల్లో ఉంది. ధనుర్మాసం నెల రోజులూ సూర్యోదయానికి ముందు కృష్ణ, గోదాదేవిలకు నివేదన చేసి తరుప్పావై పఠించి హరిదాసులు అక్షయపాత్రను ధరిస్తారు. గ్రామ సంచారం ప్రారంభమైన దగ్గర నుంచి దించడం, మాట్లాడటం చేయరు. ఆధ్యాత్మిక, రామాయణ కీర్తనలు, కృష్ణ లీలలను గానం చేస్తూ సంక్రాంతి శోభను పల్లెలకు తీసుకువస్తారు.

వాహన చోదకా.. లైసెన్సు ఉందిగా..

- డ్రైవింగ్ చేయడానికి లైసెన్సు తప్పనిసరి
- తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు



తనిఖీలో పట్టుబడిన లైసెన్సు లేని వాహన చోదకులు

కంబాలచెరువు: జనాభాకు అవసరాలకు తగ్గట్టుగా ద్విచక్ర వాహనాలు, కార్లు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో రహదారులపై నిత్యం ట్రాఫిక్ చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనికి తోడు వాహన చోదకుల అవగాహనా రాహిత్యం కారణంగా ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. సంబంధిత శాఖలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఫలితం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు.

నిబంధనలు బేఖాతరు

రహదారి భద్రతలో భాగంగా ప్రతి వాహన చోదకుడూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్న నిబంధన ఉంది. కానీ ఈ విషయంలో వాహన చోదకుల నుంచి పూర్తి సహకారం ఉండటం లేదు. లైసెన్స్ అనేది రవాణా, పోలీసు శాఖల కోసమే అని చాలా మంది భావన. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండానే వాహనాలతో రోడ్డుపైకి వచ్చే వారే సగం ప్రమాదాలకు కారణం అవుతున్నారని జరిగిన ప్రమాదాల లెక్కలు చెపుతున్నాయి. దీనికి తోడు కొందరు తమ పిల్లలకు మైనారిటీ తీరకుండానే వాహనాలు ఇస్తున్నారు. వారు అతివేగం, నిర్లక్ష్యంతో రోడ్లపై వాహనాలు నడిపి పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

10,303 కేసులు

రోడ్డ ప్రమాదాల నియంత్రణకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. లైసెన్సు లేని వాహన చోదకులను గుర్తించి జరిమానా విధిస్తున్నారు. ఇలా 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకూ 10,303 కేసులు నమోదు చేశారు. వారి నుంచి జరిమానాగా రూ.51.53 లక్షలు వసూలు చేశారు.

ప్రయోజనాలు ఇవే..

వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. రహదారిపై తిరిగే ప్రతి వాహనానికి కండీషన్ ఎంత ముఖ్యమో, ఇన్సూరెన్స్ కూడా అంతే అవసరం. ప్రమాదాల సమయంలో వాహనం నడిపిన వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే అతడితో పాటు వాహనం ఇచ్చిన సంబంధిత వాహన యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. డ్రైవింగ్ నిర్లక్ష్యంతో పాటు లైసెన్స్ లేకుండా వాహనం నడపడం పెద్ద తప్పిదం. దీని వల్ల జైలుశిక్ష, జరిమానా కూడా విధిస్తారు. వాహనానికి పూర్తిస్థాయిలో ప్రమాద బీమా ఉన్నా, లైసెన్స్ లేని వాహన చోదకుడికి అది వర్తించదు.

లైసెన్సు పొందే విధానం

వాహనం నడపటానికి డ్రైవింగ్ లైసెన్సు చాలా అవసరం. దీన్ని మంజూరు చేయడానికి రవాణాశాఖ పరీక్షలు నిర్వహిస్తుంది. దానిలో మొదటిది లెర్నర్ లైసెన్స్. మైనారిటీ తీరిన తర్వాత లైసెన్స్ పొందేందుకు నిర్దేశిత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రహదారి నిబంధనలు, వివిధ సింబల్స్, హెచ్చరికల బోర్డులు, వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. అనంతరం రవాణా శాఖ కార్యాలయంలో కంప్యూటర్‌లో పరీక్ష రాయాలి. ఈ పరీక్ష ఉత్తీర్ణులైన 40 రోజుల లోపు పర్మినెంట్ లైసెన్స్ పొందాలి. ఈ దశలో రవాణాశాఖ అధికారుల పర్యవేక్షణలో స్వయంగా మన వాహనంపై డ్రైవింగ్ చేయాలి. అనంతరం లైసెన్స్ మంజూరు చేస్తారు.